కుప్పలు.. తిప్పలు

- కల్లాలు లేక కర్షకుల కష్టాలు
- రోడ్ల వెంట ఆరబోస్తుండడంతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


వేమనపల్లి: కొత్తపల్లి రోడ్డుపై ఉన్న వరి ధాన్యం


చింతలపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆరబోసిన వరిధాన్యం


దండేపల్లి: కొండాపూర్ సమీపంలో రోడ్డుపై ధాన్యం రాశులు

వేమనపల్లి/దండేపల్లి: ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, ధాన్యంలో తేమ లేకుండా ఉండేందుకు ఆరబోయాలంటే కల్లాలు లేకపోవడంతో అన్నదాతలు అనేక కష్టాలు పడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో చాలా చోట్ల రోడ్ల పక్కన ధాన్యం రాశులు, ఆరబోసిన దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. దండేపల్లి మండలంలోని మేదరిపేట–గూడెం రింగురోడ్డును చాలా మంది రైతులు కల్లాలుగా వినియోగించుకుంటున్నారు. రోడ్డుపైనే ధాన్యం ఆరబోయడం, కుప్పగా పోసి ఉంచారు. నెల్కివెంకటాపూర్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ధాన్యం కుప్పలు దర్శనమిస్తున్నాయి.

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద, అక్కెపల్లి, చింతలపల్లి, కిష్టంపేట తదితర గ్రామాల్లో వరిధాన్యం ఆరబోసేందుకు కల్లాలు లేకపోవడంతో రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న సర్వే


కోటపల్లి: సర్వే చేస్తున్న వైద్యులు

తాండూర్: తాండూర్ గ్రామంలో బుధవారం రాత్రి కాపువాడ, ఎన్టీఆర్‌కాలనీలో బోదకాలు వ్యాధి సర్వే నిర్వహించారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరు టీమ్‌లు ఏర్పాటు చేసి, ఆయా వాడల్లో ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఝాన్సీ, శ్రీదివ్య, సూపర్‌వైజర్లు తారాబాయి, రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ దావులత్, ఎల్‌టీ హకీమ్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కోటపల్లి: కోటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కోటపల్లి మండలకేంద్రంలో బోదకాలు వ్యాధి నిర్ధారణ రక్తనమునాల సేకరణను ప్రారంభించారు. డాక్టర్ అరుణశ్రీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటా రక్తనమునాలు సేకరించారు. ఆరు టీంలతో మొత్తం 300రక్తనమునాలను సేకరించారు. అనంతరం బోదకాలు వ్యాధి నివారణ, లక్షణాలపై డాక్టర్ అరుణశ్రీ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు యోగాపై అవగాహన


శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్ సుధాకర్

మంచిర్యాలఅర్బన్: స్థానిక సాయికుంట గిరిజన ఆశ్రమ పాఠశాల, బాలికల వసతిగృహంలో గురువారం యోగా ఇన్‌స్ట్రక్టర్ సుధాకర్ బాలికలకు యోగాపై అవగాహన కల్పించారు. 8, 9, 10విద్యార్థినులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. మానసిక ఒత్తిడి, భయాందోళన దూరం చేయటంలో యోగా ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాస్, డీపీఎం ఇన్‌చార్జి రవి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్


వంటకాలు పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

దండేపల్లి: మండలంలోని కాసిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద వివిధ రకాల పిండి వంటలు (పూరీలు, లడ్డు, పకోడీ, మిర్చి, సమోసా, పాయసం)తయారు చేసుకుని తీసుకొచ్చి పాఠశాలలో ప్రదర్శించారు. వంటకాలను వెల్గనూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయలక్ష్మి పరిశీలించి మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సామూహికంగా భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సులేఖ, ఉపాధ్యాయులు సుప్రజా, అశోక్, షరీఫ్, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

వరి పంట వ్యర్థాలు కాల్చొద్దు


అవగాహన కల్పిస్తున్న ఏఈవో

వేమనపల్లి: మండలంలోని జిల్లెడ గ్రామంలో వేమనపల్లి వ్యవసాయ విస్తీర్ణాధికారి రుక్సార్‌సుల్తానా ఆధ్వర్యంలో గురువారం రైతులకు వరి పొలంలో వ్యర్థాలను కాల్చొద్దని అవగాహన కల్పించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం, భూమిలో సూక్ష్మపోషకాలు కోల్పోతుందని సూచించారు.

గడువు పొడగింపు

దండేపల్లి: 2024–25విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 16వరకు గడువు పొడగించినట్లు దండేపల్లి ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సహాయ కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నం: 83097 69067లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సబ్సిడీపై అందుబాటులో వరి విత్తనాలు


దండేపల్లి: విత్తనాల పంపిణీలో పాల్గొన్న ఏడీఏ ప్రసాద్

దండేపల్లి: ప్రస్తుత యాసంగిలో సన్నరకం వరి సాగు చేసే రైతులకు కూనారం 1638 రకం ఎంతో అనుకూలమైందని మంచిర్యాల సహాయ వ్యవసాయాధికారి ప్రసాద్ సూచించారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా దండేపల్లిలో ఎంపిక చేయబడిన రైతులకు రాయితీపై కూనారం వరి విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూనారం 1638సన్నరకం వరి, దీంతో మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు. పంట కాలం 135రోజులు మాత్రమే అన్నారు. కార్యక్రమంలో ఏవో అంజిత్‌కుమార్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

జైపూర్/చెన్నూర్‌రూరల్: జాతీయ ఆహార భద్రతా పథకం కింద రైతులకు అందజేసేందుకు గాను 50శాతం సబ్సిడీపై వరి విత్తనాలు ఆయా వ్యవసాయశాఖ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని చెన్నూర్ ఏడీఏ బానోతు ప్రసాద్, భీమారం మండల వ్యవసాయశాఖ అధికారి అత్తె సుధాకర్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. చెన్నూర్‌లో కేఎన్‌ఎం 1638రకం 15క్వింటాళ్లు, భీమారంలో కేఎన్‌ఎం 1638రకం 55క్వింటాళ్లు, జైపూర్‌లో జేజీఎల్ 24423 రకం 70క్వింటాళ్లు, మందమర్రిలో జేజీఎల్ 7క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి


భోజనం పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

కాసిపేట: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి యాదయ్య హెచ్చరించారు. మండలంలోని కస్తూరిబా గాంధీ ఆశ్రమ పాఠశాల, తెలంగాణ మోడల్‌స్కూల్, బాలికల హాస్టళ్లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కేజీబీవీలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్ విధుల్లో ఉండగా టీచింగ్ స్టాఫ్ నలుగురు ఉండి మిగితా వారు సమ్మెలో ఉన్నట్లు తెలిపారు. లీవ్‌లో ఉంటే తప్పకుండా లీవ్ లెటర్ ఉండాలని, లేనట్లైతే చర్యలు తప్పవన్నారు. వంట గదులు, వంట సామగ్రిని పరిశీలించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. డీఈవో వెంట ఎంఈవో ముక్తవరం వెంకటేశ్వరస్వామి, తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కోటపల్లి: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలో గుర్తించిన పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో అభ్యంతరాలుంటే తెలపాలని ఎంపీడీవో లక్ష్మయ్య సూచించారు. కోటపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అన్ని గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

కాసిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం 2వ సాధారణ ఎన్నికలకు సంబంధించి గ్రామపంచాయతీల వారీగా డ్రాఫ్టు పోలింగ్ స్టేషన్‌ల జాబితా అభ్యంతరాలపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామపంచాయతీలో పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, సీనియర్ సహాయకులు లక్ష్మినారాయణ, పార్టీల నాయకులు రత్నం ప్రదీప్, సూరం సంపత్, వాసుదేవ్ తదితరులున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు


చెన్నూర్: పోటీలు ప్రారంభిస్తున్న డీపీవో

చెన్నూర్: క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు పోటీల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్ మండల స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. వాలీబాల్, అథ్లెటిక్స్, కోకో, కబడ్డీ పోటీలు నిర్వహించగా 200మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ రాజేష్‌బాబు, డీటీ ప్రకాష్, పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైపూర్: భీమారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్–2024క్రీడా పోటీలను ఎమ్మార్వో సదానందం, ఎంపీడీవో మధుసూదన్, ప్రత్యేకాధికారి కల్పన, ఎస్సై శ్వేత ప్రారంభించారు.

కాసిపేట: మండల కేంద్రంలోని కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు సీఎం కప్ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీవో సబ్దర్ అలీ పాల్గొన్నారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రామాంజనేయ, ఎంపీడీవోలు గంగామోహన్, శంకర్ పాల్గొన్నారు.

నేడు సీవోఈలో సీఎం కప్ క్రీడా పోటీలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీవోఈ) విద్యాలయంలో శుక్రవారం మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. మండలం మొత్తంగా 14 పాఠశాలల నుంచి 450 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో 200 మంది క్రీడాకారులు కోకో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. ఈనెల 16వ తేదీన మంచిర్యాలలో నిర్వహించే జిల్లాస్థాయి క్రీడా పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో సరోజ, ఎంఈవో హెలెన్ డారతి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ కేంద్ర సంఘం సలహాదారు నంద అశోక్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ నాన్ గెజిటెడ్ ఉద్యోగి సభ్యత్వం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కోశాధికారి అనుముల సతీశ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు కేజియా రాణి, రామ్ కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

'నామినేటెడ్ పదవి ఇవ్వండి'

బెల్లంపల్లి: విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పనిచేస్తున్న తనకు ఏదో ఒకటి కార్పొరేషన్ పదవి ఇవ్వాలని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు కోరారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాభై ఏళ్ల పైబడి నుంచి కాంగ్రెస్‌లో తాను పని చేస్తున్నానని తెలిపారు. ఎన్నో కష్టనష్టాల కోర్చి పార్టీ ఉన్నతి కోసం కృషి చేస్తున్నానని వివరించారు.

సంక్షేమ బాలికల గురుకులం సందర్శన


ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్ జోత్స్న

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయాన్ని గురువారం సాయంత్రం తహసీల్దార్ జోత్స్న ఆకస్మికంగా సందర్శించారు. వంట గదిలోని ఆహార పదార్థాలను, వండిన భోజనాన్ని పరిశీలించారు. వంటగది, ఆరుబయట ఉన్న పరిసరాలను పరిశీలించారు. అనంతరం బాలికలతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భోజనాలు ఏ తీరుగా ఉంటున్నాయని, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా అని అడిగారు. డైనింగ్ హాల్, డార్మెటరీలను తనిఖీ చేశారు. గురుకులంలో ఫిర్యాదు పెట్టెను ఏర్పాటు చేసి తాళం చెవిని తనకు అందజేయాలని తహసీల్దార్ జోత్స్న ప్రిన్సిపాల్ నిరుపమను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ విద్యార్థునులకు సూచించారు. ఆమె వెంట తాళ్ల గురిజాల ఎస్సై రమేష్, తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాల వ్యతిరేక ప్రచార పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లిలోని రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఉపాధ్యాయులతో కలిసి యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మత్తు పదార్థాల నిర్మూలన ప్రచార పోస్టర్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చెవుటు మల్లేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

రామకృష్ణాపూర్: ప్రతీ ఉద్యోగి రక్షణ సూత్రాలను తప్పక పాటిస్తూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి పాటుపడాలని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం ఆర్కే ఓసీ గనిని సేఫ్టీ కమిటీ సభ్యులు సందర్శించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, రక్షణే ప్రథమ ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రక్షణ కమిటీ కన్వీనర్, జీఎం ఆర్‌అండ్‌డీ నారాయణరావు, ఎస్‌ఓటు జీఎం విజయ ప్రసాద్, ఏఎల్‌ఎస్‌పీ సునీల్‌వర్మ, డీజీఎంలు రామకృష్ణ, లక్ష్మి రాజు, ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 కొత్తరోడ్‌లో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని గురువారం కాలనీ వాసులు ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాలనీవాసులు బొడ్డు ప్రభాకర్, మొగిలి, కిషన్ పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్ కార్మికులపై వివక్ష'

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థలో విధులు నిర్వర్తిస్తూ సంస్థను లాభాల్లోకి నడిపిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులపై యాజమాన్యం వివక్ష చూపిస్తుందని సింగరేణి కాంట్రాక్ కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 'ఒకే కుటుంబం–ఒకే గమ్యం –ఒకే లక్ష్యం' అని నినదిస్తూ కాంట్రాక్ట్ కార్మికులపై ఎందుకు వివక్ష చూపుతుందని ప్రశ్నించారు. పర్మినెంట్ కార్మికులకు అందించే సౌకర్యాలు కాంట్రాక్ట్ కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు.

మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్షా సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై గురువారం మల్టీ డిపార్ట్‌మెంటల్ బృందం సభ్యులు మొదటి, రెండో షిఫ్టులలో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను, సాధించిన ప్రగతి, భూగర్భ, ఓపెన్ కాస్టు గనులలో యంత్రాల వినియోగం సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలు, కంపెనీ ముందు ఉన్న సవాళ్లు, లక్ష్యాలు సాధించేందుకు చేయాల్సిన పనులపై చర్చించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు డీజీఎం ఈఅండ్‌ఎం వెంకటరమణ, డీజీఎం ఎఫ్అండ్ఏ ఆర్‌వీఎస్‌ఆర్‌కే ప్రసాద్, డీజీఎం ఐఈడీ రాజన్న, డీవైపీఎం ఆసిఫ్, వర్క్‌షాప్ ఎస్ఈ కృష్ణారెడ్డి, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, పిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, సంక్షేమాధికారి భార్గవ్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కోలిండియా స్థాయిలో రాణించాలి


శిక్షణకు హాజరైన క్రీడాకారులు

శ్రీరాంపూర్: సింగరేణి క్రీడాకారులు కోలిండియా స్థాయిలో రాణించాలని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో గురువారం కంపెనీ స్థాయిలో సెలెక్ట్ అయిన వాలీబాల్ జట్టు క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సింగరేణిలో క్రీడలకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు. కంపెనీలో చాలామంది క్రీడాకారులు ఉన్నారని, వారు తమ క్రీడా నైపుణ్యాన్ని మరింత మెరుగుపర్చుకొని రాణించాలన్నారు. ఈ సారి కోలిండియా పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, స్పోర్ట్స్ కార్యదర్శి పాల్‌సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్ పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: ఏరియాలోని అధికారులకు యాజమాన్యం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్లో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించింది. 13 మంది అధికారులు సీనియారిటీ ఆధారంగా క్వార్టర్లను పొందారు. కార్యక్రమంలో ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, ఎస్టేట్స్ అధికారి మహేష్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీసీ రాజ్యాధికార సమితి కార్యవర్గం

పాతమంచిర్యాల: బీసీ రాజ్యాధికార సమితి కార్యవర్గ ఎన్నికలు జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. జిల్లా యువజన కోఆర్డినేటర్‌గా పెద్దల చంద్రకాంత్, చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా ఆవిడపు గణేష్‌ను నియమించినట్లు బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు నాసా కిట్లను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి అందజేశారు. 29మంది విద్యార్థులు అంతరిక్షంలో కాలనీలు, హస్పిటల్, మైనింగ్ ఎలా నిర్వహించాలో ప్రాజెక్టులు తయారు చేసి నాసా వారికి అందించనున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

జైపూర్: మండలంలోని కిష్టాపూర్–సుందిళ్ల బ్యారేజీ రోడ్డు జెంక్షన్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్సై శ్రీధర్ ప్రారంభించారు. కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లుగా వారు తెలిపారు. జైపూర్–మంథని మండలాల మధ్యగల సుందిళ్ల బ్యారేజీ ప్రధాన రహదారి జెంక్షన్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘాను పటిష్టపర్చినట్లు తెలిపారు.

నియామకం

పాతమంచిర్యాల: రైట్‌టూ హెల్త్ ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడిగా పోరండ్ల శ్రీనివాస్‌ను నియమించినట్లు ఆ ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో శ్రీనివాస్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

లక్సెట్టిపేట: విశ్వ హిందూ పరిషత్ ప్రఖండ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రెవెల్లి రాజలింగు తెలిపారు. అధ్యక్షుడిగా జుగునాక సూరు, కార్యదర్శిగా బిరుదుల సంతోష్‌కుమార్, సహాయకార్యదర్శిగా పింగిళి రవి ఎన్నికయ్యారు.

జైపూర్: భీమారం మండల తెలంగాణ నేతకాని మహర్ సంక్షేమ సంఘం నూతన కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా కోట రాజం ఎన్నికయ్యారు.

తాండూర్ : మండలంలోని గోపాల్‌నగర్‌కు చెందిన మండిగ రవీందర్ ఆదివాసీహక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాడు. బొక్కలగుట్ట శివారు గాంధారివనం వద్ద గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లకు సన్మానం

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తించి బదిలీపై దండేపల్లి, మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లకు వెళ్తున్న శ్రీనివాస్, మహేష్‌ను ఎస్సై గంగారాం, తోటి సిబ్బంది సన్మానించారు.